సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం। 10। ఏప్రిల్। 2023



సేవలు విస్తృతం

రైతు భరోసా కేంద్రాల్లో వీవీఏలకు నపోర్టుగా 542 మంది సిబ్బంది నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీరు రైతులకు సేవలందించనున్నారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,310
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,566
3 శాతం జీఎస్టీతో	రూ.5,732
నవర (8 గ్రా)	రూ.45,856

గరిష్టం/కనిష్టం 34.9 /26.5

వాతావరణం

ఆదివారం గాలిలో 58 శాతం తేమ ఉంది. జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



ఇఫ్తార్	సహర్
సోమవారం (సా)	మంగళవారం (ఉ)
6.23	4.38

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

మళ్లీ తగ్గిన నిమ్మ ధరలు




యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు: నిమ్మ ధరలు తగ్గుముఖం పడుతూనే ఉన్నాయి. గతేడాది లూజు (బస్తా) రూ.16 వేల వరకు రికార్డు స్థాయిలో ధర పలికింది. ఈ ఏడాది అందులో సగం ధర కూడా పలకడం లేదు. ప్రస్తుతం బస్తా రూ.4 వేల నుంచి రూ.5,500 వరకు ధర పలుకుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఇదే ధరలు కిలోల వంతున రూ.60 నుంచి రూ.74 వరకు ఉన్నాయి. ప్రతి ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ధరలు అమాంతం పెరిగేవి. అయితే ఈ ఏప్రిల్ నెలలో కూడా ధరలు పెరగకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిమ్మ ధరలను శాసించే ఢిల్లీ మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి ఎగుమతులు పెరిగడంతో ధరల్లో వ్యత్యాసం ఉన్నట్టు తెలుస్తోంది.

75 శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో 75 శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు కొనుగోలు చేయొచ్చని పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 130 మెట్రిక్ టన్నుల విత్తనాలు ఉన్నాయన్నారు. జొన్న, మొక్కజొన్న, సజ్జలు, అలసందలు విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలియజేశారు. ప్రభుత్వం ఇప్పటికే 100 మెట్రిక్ టన్నులను వివిధ చోట్ల రైతులకు అందజేసిందన్నారు. రైతుల అవసరాలను బట్టి రాష్ట్ర ప్రభుత్వం మరింత సరఫరా చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. కాగా కిలోకి 75 శాతం సబ్సిడీపై ఈ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

సోమశిలలో 53.114 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 53.114 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 369 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 1,200 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.865 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 326 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

మోటార్‌బైక్‌పై వెళ్తూ..

- కిందపడి వ్యక్తి మృతి

ఉలవపాడు: మోటార్‌బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆత్మకూరు వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఆత్మకూరు గ్రామానికి చెందిన తల్లపనేని వరప్రసాద్‌రావు (62) ఉలవపాడుకు మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. గ్రామం బయటకు రాగానే ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ఈ క్రమంలో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. వరప్రసాద్‌రావుకు భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్టలో జలసిరులు

ఐదు సంవత్సరాల క్రితం మెట్ట పల్లెల్లో దారుణ పరిస్థితులు కనిపించేవి. కరువు విలయతాండవం చేసింది. భూగర్భ జలాలు అడుగంటాయి. గుక్కెడు నీటికి జనం అల్లాడిన సందర్భాలెన్నో.. పంటలకు సాగునీరందక అన్నదాతలు విలవిల్లాడిన రోజులూ ఉన్నాయి. నేడు అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. విస్తారంగా వర్షాలు కురవడంతో చెరువులు, వంకలు, వాగులు జలకళ సంతరించుకున్నాయి. కాలువల్లో నీటి పారుదల కారణంగా భూగర్భ జలాలు రికార్డు స్థాయికి చేరాయి.


- ఐదు సంవత్సరాల క్రితం ఆందోళనకర స్థాయిలో నీటిమట్టం
- మూడేళ్లుగా మారిన పరిస్థితులు
- సమృద్ధిగా నీటి వనరులు
- గతంలో బోరు వేసినా ఫలితం శూన్యం
- నేడు నీరందుతుండడంతో పెరిగిన ఉద్యాన పంటల సాగు

ఉదయగిరి: ఉదయగిరి ప్రాంతం సముద్ర మట్టానికి 270 మీటర్ల ఎత్తులో ఉంటుంది. నియోజకవర్గంలోని సీతారామపురం, వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి మండలాల్లో 2018 సంవత్సరంలో భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయి. ఆ ఏడాది సగటు భూగర్భ జలమట్టం 14.06 మీటర్లకు దిగజారింది. ఫలితంగా ఈ మండలాల్లో ఉద్యానవన పంటలు సైతం నిలువునా ఎండిపోయాయి. ప్రజలు గుక్కెడు నీటికోసం నానా అవస్థలు పడ్డారు. తాగునీటి కష్టాలను ట్యాంకర్ల ద్వారా కొంతమేర మాత్రమే తీర్చగలిగారు. మొత్తంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉదయగిరి మెట్ట ప్రాంతంలో పంటలు సాగుచేసే పరిస్థితి కనిపించలేదు. బోర్లు ఒట్టిపోవడంతో ఏళ్ల తరబడి పెంచుకున్న బత్తాయి, మామిడి, నిమ్మ చెట్లు కళ్లెదుటే ఎండిపోయి అన్నదాతలు విలపించారు.

భూగర్భ జలమట్టం ఇలా..	
సంవత్సరం	మార్చి నెలలో..
2018	13.04 మీటర్లు
2019	9.09 మీటర్లు
2020	5.93 మీటర్లు
2021	2.90 మీటర్లు
2022	3.24 మీటర్లు

బోర్లలో ఉప్పొంగి..

జిల్లాలోని మెట్ట మండలాల్లో బోర్లపైనే ఆధారపడి సాగు జరుగుతుంది. సుమారు లక్షకు పైగా బోర్ల ద్వారా ఉద్యాన తోటలు, వరిపైరు సాగు చేస్తున్నారు. ఒక్క ఉదయగిరి ప్రాంతంలోనే 30 వేలకు పైగా బోర్ల కింద 20 వేల హెక్టార్లలో రైతులు ఉద్యాన తోటలు సాగుచేస్తున్నారు. దీనికితోడు కూరగాయల తోటలు, పండ్లతోటలు కూడా సాగులో ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలావరకు పండ్లతోటలు ఎండిపోయాయి. మామిడితోటలకు బెట్ట రావడంతో అదే పరిస్థితి నెలకొంది. అయితే ఈ మూడేళ్లలో వర్షాలు సకాలంలో కురవడంతో ఉదయగిరి, ఆత్మకూరు,



గండిపాళెం జలాశయం



ఉదయగిరి మండలంలో బోరు పాయింట్ నుంచి వస్తున్న నీరు

కావలి నియోజకవర్గాల్లో నీరు లేక ఒట్టిపోయిన బోర్లు మళ్లీ వినియోగంలోకి వచ్చాయి. ఉదయగిరి ప్రాంతంలో ఎండిపోయిన ఉద్యాన తోటలకు సాగునీరు సమృద్ధిగా అందుబాటులోకి రావడంతో మళ్లీ సాగుచేస్తున్నారు.

అందుబాటులో..

జిల్లాలో వివిధ ప్రాజెక్టులు, చెరువులు, వివిధ చోట్ల ప్రస్తుతం నీరు సమృద్ధిగా ఉంది. సోమశిల జలాశయంలో 50 టీఎంసీల మేర నీటి నిల్వ ఉంది. దీని ద్వారా జిల్లాలో రెండో పంటకు నీరు అందించనున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో గండిపాళెం ప్రాజెక్టు, నక్కలగండి రిజర్వాయర్లలో కూడా పుష్కలంగా నీరు ఉంది. రాళ్లపాడు ప్రాజెక్టులోకి సోమశిల జలాలు చేరడంతో జలకళ సంతరించుకుంది. పైగా సోమశిలకు సంబంధించిన ఉత్తర, దక్షిణ కాలువల్లో సమృద్ధిగా నీరు పారుతుండటంతో సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు బాగా వృద్ధి చెందాయి. వేసవి వచ్చిందంటే నీటిజాడలు లేక కటకటలాడే మెట్ట ప్రాంతాల్లో ఏప్రిల్ నెలలో సైతం పంట పొలాలు పచ్చగా కనిపిస్తున్నాయి. తాగునీటి సమస్య కనిపించడం లేదు. ఇదంతా మూడేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన భూగర్భ జలాల వృద్ధి ప్రణాళిక ద్వారానే సాధ్యమైంది.

నేడు భిన్నమైన పరిస్థితులు

2020 సంవత్సరం నుంచి మెట్ట ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. 14 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం 2022 నాటికి ఈ ప్రాంతంలో 2.20 మీటర్లకు చేరిందని అధికారులు తెలిపారు. దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, సీతారామపురం, కలిగిరి, ఉదయగిరి, కొండాపురం మండలాల్లో నేడు మూడు మీటర్లలోపే భూగర్భ జలాలు లభ్యమవుతున్నాయి.

వినియోగంలోకి బోర్లు



ఒకప్పుడు కొన్ని బోర్లలో అరకొరగా మాత్రమే నీరు వచ్చేది. మూడేళ్ల నుంచి వర్షాలు బాగా పడుతుండడంతో ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో ఎండిపోయిన బోరు బావుల్లో భూగర్భ జలమట్టం పెరిగింది. బోర్లు వినియోగంలోకి వచ్చాయి. నీరు సమృద్ధిగా ఉండడంతో ఉద్యానవన రైతులు ఎండిపోయిన తోటలను మళ్లీ సాగు వేస్తున్నారు.

– సుభాని, రైతు, ఉదయగిరి

అప్పట్లో నష్టపోయాను



ఐదేళ్ల క్రితం వరికుంటపాడు ప్రాంతంలో వెయ్యి అడగుల మేర బోర్లు వేసినా నీటిజాడ కనిపించేది కాదు. ఉద్యాన తోటలు కాపాడుకునేందుకు అనేక బోర్లు వేసి నష్టపోయాను. బత్తాయితోట ఎండిపోయింది. మూడేళ్ల నుంచి వర్షాలు బాగా పడడంతో గండిపాళెం జలాశయానికి భారీగా నీరు చేరి భూగర్భ జలం పెరిగింది. నేడు నీరు బాగా అందుతోంది.

– నాగభూషణం, రైతు, వరికుంటపాడు

పరిస్థితి మెరుగైంది

మూడేళ్ల నుంచి తుపాన్లతో వర్షాలు బాగా పడి మెట్ట ప్రాంతంలో సైతం భారీగా భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. గడిచిన ఐదేళ్ల కంటే ప్రస్తుతం పరిస్థితి చాలా మెరుగైంది. 2018లో 13 మీటర్ల లోతున్న భూగర్భ జలమట్టం నేడు మూడు మీటర్లలోపే అందుబాటులోకి వచ్చింది.

– ఆర్.శోభన్‌బాబు, డీడీ, భూగర్భ జల శాఖ

పేదలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: పేదలకు మేలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముంగళదొరువు గ్రామ పంచాయతీలో ఆదివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. గడిచిన నాలుగేళ్లలో లక్షలాది కుటుంబాలకు రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ క్యాలెండర్‌ను తేదీలతో సహా ముందుగానే ప్రకటించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. చిన్న పంచాయతీ అయిన ముంగళదొరువులో నాలుగేళ్లలో రూ.42 లక్షలతో సీసీ రోడ్లు, రూ.30 లక్షలతో సైడ్ డ్రెయిన్లు, రూ.18 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అలాగే ముంగళదొరువుకు అనుబంధంగా ఉన్న చింతోపు సచివాలయానికి సంబంధించి రూ.3.73 కోట్లతో గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించినట్లు చెప్పారు. పెద్దఎత్తున సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజల ఆదరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులునాయుడు, నాయకులు కావల్‌రెడ్డి రంగారెడ్డి, టంగుటూరు పద్మనాభరెడ్డి, దగ్గు సతీష్, కోనేటి రాజు, ఐరగరాజు ఉపేంద్ర, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, లేబూరు మల్లికార్జున్, ఆకుల మధు, నెల్లిపూడి సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

‘నేను నెల్లూరువాసిగా మారిపోయా’

- అధికారుల సహకారంతో జిల్లాకు అవార్డులు
- కరోనా కాలంలో కష్టపడి పనిచేశాం
- సన్మాన సభలో కేవీఎన్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): ‘నా సర్వీస్‌లో ఇప్పటివరకు ఎక్కువగా నెల్లూరు జిల్లాలో పనిచేశారు. మున్సిపల్ కమిషనర్‌గా, కలెక్టర్‌గా విధులు నిర్వహించా. అందువల్ల తెలియకుండానే నెల్లూరువాసిగా మారిపోయా.’ అని ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు అన్నారు. ఆయన కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి జిల్లా యంత్రాంగం తరఫున నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఆయనకు ఆత్మీయ వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రధర్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో కరోనా ఉధృతంగా ఉన్న సందర్భంలో తాను కలెక్టర్‌గా వచ్చానన్నారు. ఒకరోజు ఉదయం 8 గంటలకు ఓ బాలుడు తనకు ఫోన్ చేసి తమ ఇంట్లోని వ్యక్తి కోవిడ్‌తో మరణించాడని రాత్రంతా తానొక్కడినే మృతదేహం పక్కన ఉన్నానని తెలిపాడన్నారు. ఎవరూ ఇంటి వద్దకు రాలేదని, ఏదో ఒకటి చేయాలని అడిగాడన్నారు. అప్పుడే జిల్లాలోని పరిస్థితి తనకు అర్థమైందన్నారు. వెంటనే స్పందించి డాక్టర్లతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు ఇస్తూ పని చేసినట్లు చెప్పారు. కోవిడ్ బాధితులకు అండగా ఉంటూ అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో కోవిడ్ నియంత్రణకు చేపట్టిన చర్యలు ఫలితాలనిచ్చాయన్నారు. ఇందుకు అన్ని శాఖలకు చెందిన అధికారులు సహకరించారన్నారు. 2022 సంవత్సరం మే 12వ తేదీన ఆలిండియా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో నెల్లూరు జిల్లాలో కరోనా నియంత్రణకు చేపట్టిన చర్యల గురించి అందరూ అభినందించడం తనకు తీపిగుర్తు అన్నారు. కోవిడ్ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొని రాష్ట్రాన్ని ముందుకు నడిపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేన్నారు. ఇక్కడ సుమారు మూడేళ్లు కలెక్టర్‌గా పనిచేశానన్నారు. వ్యవసాయ శాఖ, డీఆర్‌డీఏ, మత్స్య శాఖ, నగరపాలక సంస్థ, ఇలా పలు శాఖలకు దేశస్థాయిలో అవార్డులు రావడానికి అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు అందించిన సహకారమే కారణమన్నారు. జిల్లాలో సాధించిన ప్రగతి గురించి అధికారులు చెబుతుంటే తనకు సంతృప్తిగా ఉందన్నారు. అందుకే జిల్లాను వీడడం బాధాకరంగా ఉందన్నారు. ఉద్యోగ నిర్వహణలో బదిలీలు తప్పవన్నారు. జిల్లాలో పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని, ప్రజలు అందించిన ప్రేమానురాగాలు మర్చిపోలేనన్నారు. అధికారుల నెత్తిన పిడుగులు పడుతుంటాయని, కలెక్టర్ నెత్తిన రోజూ పడుతుంటాయన్నారు. వాటికి భయపడకూడదన్నారు. ఉద్యోగులు తమ కుటుంబాలను చూసుకుంటూనే ప్రజలకు సేవలందించాలని కోరారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఇతర అధికారులు చక్రధర్‌బాబు సేవలను కొనియాడారు.



చక్రధర్‌బాబు దంపతులను సన్మానిస్తున్న జేసీ, డీఆర్వో తదితరులు

ఘనంగా సన్మానం

ఈ సందర్భంగా అన్ని శాఖలకు చెందిన అధికారులు చక్రధర్‌బాబు, ఆయన సతీమణి కిరణ్మయిని ఘనంగా సన్మానించారు. ముందుగా చక్రధర్‌బాబు దంపతులకు ఒకరికొకరు దండలు మార్పించారు. సన్మానించిన వారిలో ఏట షఫీమాలిక్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్ నాథ్ తదితర శాఖల అధికారులున్నారు.

అందరి సహకారంతో మెరుగైన సేవలు

నెల్లూరు సిటీ: జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించానని సీహెచ్ విజయారావు అన్నారు. ఆయన ఎస్పీగా పనిచేస్తూ బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రూరల్ నియోజకవర్గంలోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విజయారావుకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు కృషి చేశామన్నారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతోనే నేరాలను కట్టడి సాధ్యమైందన్నారు. నెల్లూరులో పనిచేయడం సంతోషంగా ఉందని, ఎప్పటికీ మరువలేనని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

అందం.. ఆహ్లాదం

నెల్లూరు నగర రూపురేఖలు మారుతున్నాయి. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ స్థాయికి చేరి చాలా కాలమైంది. విస్తీర్ణం, జనాభా సంఖ్య పెరిగింది. అయితే పచ్చదనంపై గత పాలకులు ఆశించిన స్థాయిలో శ్రద్ధ పెట్టలేదు. నేడు పరిస్థితి మారింది. నగర సుందరీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధాన రహదారుల మధ్యలో ఉన్న డివైడర్లు, ఇంకా ఐలాండ్‌లలో పూలు, వివిధ రకాల మొక్కలు నాటి సంరక్షిస్తూ ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

వేగంగా నగర సుందరీకరణ

- మొక్కల పెంపకానికి రూ.86 లక్షల ఖర్చు
- డివైడర్లు, ఐలాండ్‌లలో పూలమొక్కల పెంపకం
- పలు ప్రాంతాల్లో అవెన్యూ ప్లాంటేషన్
- ఇప్పటికే 80 శాతం మేర పనుల పూర్తి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 54 డివిజన్లు ఉన్నాయి. జనాభా సుమారు 8 లక్షలు. నగర సుందరీకరణపై కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నుంచి రూ.46 లక్షలు, కార్పొరేషన్ నుంచి రూ.40 లక్షల నిధులు కూడా వెచ్చించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేకంగా ఉద్యాన విభాగం కూడా ఉంది. దీని ద్వారా నగరంలో పచ్చదనాన్ని పెంచడం వంటి పనులను వేగంగా నిర్వహిస్తున్నారు.



చిల్డ్రన్స్ పార్క్ ప్రధాన రహదారిలో..

ఏం చేస్తున్నారంటే..

నగరంలో వాహనాల సంఖ్య నానాటికీ పెరిగి కాలుష్యం ఇబ్బంది పెడుతోంది. ఈ నేపథ్యంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రధాన రహదారులైన ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి (జీఎన్టీ రోడ్డు) వరకు, ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి (మినీబైపాస్ రోడ్డు) వరకు, రామలింగాపురం సెంటర్ నుంచి జాతీయ రహదారి (చిల్డ్రన్స్‌పార్కు రోడ్డు) వరకు, ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి సంతపేట (రైల్వేఫీడర్స్ రోడ్డు) వరకు, ఆత్మకూరు బస్టాండ్ నుంచి నవాబుపేట (స్టోన్‌హౌస్‌పేటరోడ్డు) పోలీస్‌స్టేషన్ వరకు డివైడర్లు, ఐల్యాండ్లను ఏర్పాటు చేశారు. నగరం మొత్తం 22 కి.మీ మేర డివైడర్లున్నాయి. అలాగే ఆయా రహదారుల్లో ప్రధాన కూడళ్లలో 30 ఐలాండ్లు, వివిధ ప్రాంతాల్లో 25 పార్కులున్నాయి. వీటిలో పూలు, పలురకాల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. దీంతో నగరం కొత్త శోభను సంతరించుకుంటోంది. వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా మొక్కల పెంపకం జరుగుతోంది. అంతేకాకుండా వెంకటేశ్వరపురం, భగత్ సింగ్‌కాలనీ, అల్లీపురం ప్రాంతాల్లో రోడ్డుకిరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టారు.

నిత్యం పర్యవేక్షణ

నగరంలోని ఆయా ప్రాంతాల్లో నాటిన పూలు, ఇతర మొక్కల సంరక్షణ బాధ్యతలను అధికారితో పాటు సిబ్బంది చూస్తున్నారు. నిత్యం ట్యాంకర్ల ద్వారా నీరు పట్టడం, మొక్కలు అందంగా కనిపించేలా కత్తిరించడం వంటి పనులు ఎప్పటికప్పుడు జరుగుతున్నాయి. కాగా మొక్కలు నాటే ప్రక్రియ ఇప్పటికే 80 శాతం మేర పూర్తయింది. మిగిలిన 20 శాతం పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.



వేదాయపాళెం ప్రధాన రహదారి వెంబడి ఇలా..

పచ్చదనం పెంచడమే లక్ష్యం



నెల్లూరు నగరంలోని ప్రధాన రహదారుల్లో పచ్చదనాన్ని పెంచడమే లక్ష్యం. అందుకు అనుగుణంగా నగరంలోని ప్రధాన రహదారుల్లోని డివైడర్లు, ఐలాండ్‌లు, ఇంకా పార్కుల్లోనూ పూలమొక్కలు నాటించాం. మిగిలిన 20 శాతం పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తాం.

– కె.ప్రదీప్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, ఉద్యాన విభాగం, నెల్లూరు కార్పొరేషన్

మంచి ప్రయత్నం



కార్పొరేషన్ అధికారులు డివైడర్లు, ఐలాండ్‌లలో పూలమొక్కలు నాటించడం బాగుంది. ఇది మంచి ప్రయత్నం. నగరం చూసేందుకు ఎంతో అందంగా కనిపిస్తుంది. ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది.

– సీహెచ్ శ్రీనివాసకుమార్, నెల్లూరు

అభినందనీయం



రోజురోజుకి కాలుష్యం అధికమవుతోంది. దీంతో ప్రజలు అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఎక్కువ. కార్పొరేషన్ అధికారులు నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయం.

– డాక్టర్ ఈదల కిషన్‌రెడ్డి, నజీర్‌తోట

సేవలు విస్తృతం

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాల్లో అన్నదాతలకు విశేష సేవలు అందుతున్నాయి. గ్రామ వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో పంటల సాగులో రైతులకు అవసరమైన సేవలందిస్తుండగా ప్రభుత్వం ఈ సేవలను విస్తృతం చేసేలా వీఏఏలకు సపోర్టుగా ఆర్బీకే మిత్రలను నియమిస్తోంది. వీరిరువురూ సమన్వయంతో పనిచేస్తూ ఆర్బీకేల్లో, క్షేత్రస్థాయిలో రైతులకు సేవలందించనున్నారు.

- ఆర్బీకేల్లో వీఏఏలకు సపోర్టుగా 'ఆర్బీకే మిత్ర'ల నియామకం
- జిల్లాలో 542 మంది నియామకానికి చర్యలు
- వీఏఏలతోపాటు రైతులకు సేవలందించనున్న 'ఆర్బీకే మిత్ర'లు


పంట వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది(ఫైల్)

జిల్లాలో..	
రైతుభరోసా కేంద్రాలు	-561
గ్రామీణ ప్రాంతాల్లో	-542
పట్టణ ప్రాంతాల్లో	-19
కొత్తగా నియామకం కానున్న ఆర్బీకే మిత్రలు	-542 మంది

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసింది. రైతుల కోసం గ్రామాల్లోనే రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేస్తోంది. అలాగే రైతుభరోసా, పంటల బీమా తదితర పథకాలను అమలు చేస్తూ అండగా నిలుస్తోంది. అంతేకాకుండా రైతుభరోసా కేంద్రాల్లో నియమించిన గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ) ఆర్బీకేల్లో సేవలందించడంతోపాటు క్షేత్రస్థాయిలో రైతుల పొలాల్లోకి వెళ్లి పంటల సాగులో సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఈ సేవలను మరింత విస్తృతం చేస్తూ ప్రభుత్వం కొత్తగా 'ఆర్బీకే మిత్ర'ల నియామక ప్రక్రియను చేపట్టింది. వీరు ఆర్బీకేల్లో రైతులకు సేవలందించనున్నారు. వీఏఏలు క్షేత్రస్థాయిల్లో రైతులకు అందుబాటులో ఉంటూ పంటలను ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన సూచనలిస్తారు.

వీఏఏలకు ప్రత్యేక బాధ్యతలు

ప్రస్తుతం జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ) రైతులకు సేవలు అందిస్తున్నారు. రైతులకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందిస్తున్నారు. అలాగే రైతుల పొలాల్లోకి వెళ్లి పంటల సాగులో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా.. తగిన మోతాదులో మందులు పిచికారీ చేస్తున్నారా.. పంట పెరుగుదలలో సమస్యలు ఉన్నాయా.. తదితర అంశాలను గుర్తించే బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇకపై వీరు స్థానికంగా ఉన్న రైతుల పొలాల్లోకి వెళ్లి పంటలను పరిశీలించి పంటకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేయడంతోపాటు ఏదైనా సమస్య ఉంటే ఏ మందులు వాడాలో తెలియజెప్పేలా ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు.

శాస్త్రవేత్తలకు సమాచారం

వీఏఏలు పొలంలోకి వెళ్లి సాగులో ఉన్న పంటలకు ఏవైనా సమస్యలు ఉంటే ఆ వివరాలను అటు వ్యవసాయశాఖ అధికారులకు, ఇటు శాస్త్రవేత్తలకు తెలియజేస్తారు. సమస్య ఎక్కువగా ఉంటే నేరుగా శాస్త్రవేత్తలే పొలంలోకి వెళ్లి పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరిస్తారు.

'ఆర్బీకే మిత్ర'ల నియామకం

రైతుభరోసా కేంద్రాల్లో సేవలందించేందుకు వీఏఏలకు సపోర్టుగా కొత్తగా ఆర్బీకే మిత్రలను ప్రభుత్వం నియమిస్తోంది. వీరు వీఏఏలు లేని సమయంలో రైతులు ఆర్బీకేలకు వచ్చినప్పుడు వారికి అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను అందించడంతోపాటు వివరాలు నమోదు చేసుకోవాల్సిఉంటుంది. జిల్లాలో 561 ఆర్బీకేలు ఉండగా వాటిలో అర్బన్ ప్రాంతాల్లో 19 ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 542 ఆర్బీకేల్లో కొత్తగా 'ఆర్బీకే మిత్ర'లను నియామకం చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని అధికారులు తెలిపారు. కాగా వీఏఏలు, ఆర్బీకే మిత్రలు రైతులకు విస్తృత సేవలు అందించనున్నారు.

ఆర్బీకేల ద్వారా సేవలు



ఆర్బీకేల్లోని వీఏఏలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించాం. వారికి సహకారంగా ఆర్బీకే మిత్రలను నియమించే ప్రక్రియను కూడా ప్రారంభించాం. వీరు రైతులకు అవసరమైన సేవలు ఆర్బీకేల ద్వారా అందిస్తారు.
– సుధాకర్‌రాజు, జేడీ, వ్యవసాయశాఖ

వేడుకగా చక్రస్నానం

గూడూరు: స్థానిక కోనేటిమిట్టలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుచ్చి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులు, చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ సంవాదం చేశారు. అనంతరం ఆలయ పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. భక్తులు కోనేటిలో మునిగి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా కృష్ణారావు, ఉమాదేవి వ్యవహరించారు. ఆలయ చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు, ఈఓ నవీన్‌కుమార్, ధర్మకర్తలు పెంచలయ్య పర్యవేక్షించారు.


చక్రస్నానం

క్లుప్తంగా

కనులపండువగా రాములోరి పట్టాభిషేకం


ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

సైదాపురం: శ్రీరామనవమిని ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సైదాపురంలో శ్రీరాముని పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం

వెంకటగిరి: గాండ్ల, తెలికుల కులస్తులు సమష్టిగా కృషి చేస్తేనే సమస్యలు పరిష్కరించుకోగలమని రాష్ట్ర గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి హరగోపాల్ అన్నారు. స్థానిక పింజల వీరయ్య కల్యాణ మండపంలో ఆదివారం ఆ సంఘం వెంకటగిరి శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వర్గానికి చెందిన ప్రముఖుల దంపతులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు దివంగత గ్రోసు గోపాలయ్య సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి శ్రీనివాసులు, సూర్యప్రకాష్, బీకేప్రసాద్, చిరువెళ్ల ప్రభాకర్, బద్రి నవీన్ పాల్గొన్నారు.

వైభవంగా రాపూరమ్మ జాతర


రాపూరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

రాపూరు: గ్రామదేవత రాపూరమ్మ జాతర మూడో రోజు ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారి ఆలయంలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

రాపూరమ్మను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు శశిరెడ్డి, మస్తాన్, కోటిరెడ్డి, పిచ్చిరెడ్డి, లోకేష్, వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

రాపూరమ్మ గ్రామోత్సవం ఆదివారం రాత్రి వేడుకగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ రాపూరు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 98
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 180
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 200
లేయర్ చికెన్	: 128



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.35



కలిసికట్టుగా పనిచేద్దాం

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి


మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఉదయగిరి నేతలు

ఉదయగిరి: ఉదయగిరి టికెట్ నిర్ణయం పూర్తిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన ప్రకారమే ఉంటుందని, ఎవరికి ఇచ్చినా అందరూ కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థి విజయం కోసం పనిచేద్దామని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు ఆదివారం నెల్లూరులో మేకపాటి నివాసంలో రాజమోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని విషయాలపై పూర్తి అవగాహన ఉందన్నారు. 2024 ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చాలా కోణాల్లో పరిశీలించి చేస్తారని తెలిపారు. ఎవరికి టికెట్ ఇచ్చినా మేకపాటి కుటుంబం వారికి పూర్తి సహకారం అందిస్తుందని, అందరం కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకునేలా పార్టీ విజయం కోసం పనిచేయాలని సూచించారు. త్వరలో అభ్యర్థి విషయంపై స్పష్టత వస్తుందన్నారు. ఆ తర్వాత ఉదయగిరిలో సమావేశం ఏర్పాటు చేసి అన్ని మండలాల నేతలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో మాట్లాడి చిన్ని చిన్న సమస్యలు ఉన్నా పరిష్కారం చేసుకుందామని తెలిపారు. ఉదయగిరికి మేకపాటి కుటుంబానికి నలభై ఏళ్ల అనుబంధం ఉందని, చంద్రశేఖరరెడ్డి వ్యవహారంతో కొంత ఇబ్బంది వచ్చిందన్నారు. అందుకు మేకపాటి కుటుంబం తరఫున ఉదయగిరి ప్రజలకు రాజమోహన్‌రెడ్డి క్షమాపణలు చెప్పారు. మాజీ ఎంపీని కలిసిన వారిలో జెడ్పీటీసీ సభ్యులు రావెళ్ల నాగేంద్ర, పావులూరు మాల్యాద్రిరెడ్డి, నాయకులు అంద్రా బాలగురవారెడ్డి, కామేపల్లి వెంకటరత్నం, గంగవరపు పుల్లయ్య, గుంటుపల్లి నాగభూషణం, ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, ఉండేల సుబ్బారెడ్డి, పెండ్యాల తిరుపతయ్య, బొమ్ము వెంకటరెడ్డి, బోగ్యం విజయ, వెంకటేశ్వర్లు, పి.వి జయభాస్కరరెడ్డి, చెన్నారాయుడు, మధు, బాలచంద్ర, వెంగయ్యనాయుడు, రవి, రమేష్ తదితరులు ఉన్నారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్రంలో సుస్థిర పాలన

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి


మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సుస్థిర పాలన సాధ్యమవుతుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెనుబల్లిలో ఆదివారం పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజ్ రుణాల కింద రూ.58.5 లక్షల చెక్కులు, వైఎస్సార్ ఆసరా మూడో విడతలో భాగంగా రూ.1.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేనిఫెస్టోలోని దాదాపు 95 శాతం హామీలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఆయనకు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని తెలిపారు. ప్రతిపక్షాలు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నాయని, వారికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు మరోసారి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రతిపక్ష టీడీపీకి ఒంటరిగా పోటీ చేసే సత్తా లేదని, ఏ ఎన్నికల్లోనైనా పొత్తు పెట్టుకోవడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్యాకేజీలకు అమ్ముడుపోయి చంద్రబాబు రాసిన స్క్రిప్ట్‌ను చదవడం అలవాటు చేసుకున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కూడా చంద్రబాబు ఇంటికే పరిమితమవుతారని, ఎమ్మెల్యేగా కూడా గెలవలేని లోకేష్‌కు ప్రజలు ఇప్పుడు గుర్తుకురావడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'కు ఆదరణ

నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న 'మా నమ్మకం నువ్వే జగన్'కు అన్ని ప్రాంతాల్లో మంచి ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు ప్రజలే ముందుగా తమ ఇంటికి స్టిక్కర్ అంటించాలని, తమ ఫోన్‌కు స్టిక్కర్ వేయాలని కోరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళీ, సర్పంచ్ ఓడా పెంచలయ్య పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు భరోసా

- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా భవిష్యత్ తరాలకు భరోసా ఇస్తున్నారని, అన్నివర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందిస్తుండడంతో 'జగనన్నే మా భవిష్యత్తు' అంటూ ప్రజలు ముఖ్యమంత్రికి నీరాజనాలు పలుకుతున్నారని తెలిపారు. ఆదివారం మండలంలోని మాముడూరు సచివాలయ పరిధిలోని ఎస్సీ కాలనీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నివర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పథకాల రూపకల్పన చేశారని, అందుకే ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను తెలుసుకొని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పలువురు కాలనీవాసులు కాలనీలో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని కోరడంతో వెంటనే ఆయా శాఖల అధికారులతో మాట్లాడి మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బూదళ్ల వీరరాఘవరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ సిరాజుద్దీన్, నాయకులు మధురెడ్డి, గోనుగుంట రాంబాబు, తేళ్ల శేఖర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, రమేష్, జయదీప్‌రెడ్డి, పెంచలరెడ్డి, జయంత్‌రెడ్డి, దాచూరు చిన్నయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.